క్లుప్తంగా

తంబళ్లపల్లె ఎమ్మెల్యేను కలిసిన సిపాయి



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌ను కలిసిన డాక్టర్ సిపాయి

తిరుపతి తుడా: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఒక్కరే బరిలో నిలిచారు. ఆయన ఎన్నికను అధికారులు ప్రకటించాల్సి ఉంది. ఈ క్రమంలో సిపాయి సుబ్రమణ్యం ఆదివారం తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, ఆర్కే రోజా, ఎంపీలు, ఎమ్మెల్యేల సహకారంతోనే తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు



ప్రభుత్వభూమిలో బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి మంగళం: ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అర్బన్ తహసీల్దార్ ఎం.వెంకటరమణ హెచ్చరించారు. తిరుపతి అర్బన్ మండలం మంగళం గ్రామలెక్క దాఖలా సర్వే నంబర్ 53/2లోని ఐదెకరాల ప్రభుత్వ భూమిలో ఆదివారం వీఆర్‌వోలు భూపతి, సుమన్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్ సీపీ డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా రమేష్



తిరుపతి తుడా: వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా తిరుపతిలోని కేఆర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ కాపిరెడ్డి రమేష్‌ను నియమిస్తూ ఆ పార్టీ కేంద్రం కార్యాలయం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాలను నియమించిన విషయం తెలిసింది. ఇందులో భాగంగా డాక్టర్స్ విభాగానికి కాపిరెడ్డి రమేష్‌ను నియమించారు. ఆయనకు ఎమ్మెల్యేలు భూమన కరుణాకర రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మేయర్ శిరీష తదతరులు అభినందనలు తెలిపారు.

అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని వినతి



రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైవీ.రామిరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ తదితర విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని ఏబీఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ వైవీ.రామిరెడ్డి, డాక్టర్ జి.రంగనాథం కోరారు. వారు ఆదివారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఏల బకాయిలను విడుదల చేయాలన్నారు.

స్థానికతపై మాట్లాడే అర్హత లోకేష్‌కు లేదు







మాట్లాడుతున్న మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, అజయ్‌కుమార్ చిత్రంలో కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నేతలు

తిరుపతి కల్చరల్: తెలంగాణలో కాపురముంటూ ఏపీలో రాజకీయాలు చేసే తండ్రీకొడుకులు నారా చంద్రబాబు, లోకేష్‌కు స్థానికత గురించి మాట్లాడే అర్హత లేదని మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. ఆమె ఆదివారం మహిళా కార్పొరేటర్లతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో పాదయాత్ర ఎవరైనా చేసుకోవచ్చని, రెచ్చగొట్టే ధోరణితో మాట్లాడుతూ ప్రజల్ని తప్పుదారి పట్టించడం దుర్మార్గమన్నారు. ప్రజల మనసును గెలవాలని, వారి కష్టాలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ఏమి చేస్తామో చెప్పాలని, రెచ్చగొట్టే ధోరణిని సరికాదన్నారు. తిరుపతి నగరానికి సాంస్కృతిక శోభను తెచ్చిన ఘనత ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికే దక్కుతుందన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి కష్టాల్లో పాలుపంచుకుంటూ తిరుపతి నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. కరోనా సమయంలో ఎమ్మెల్యే భూమన చేసిన సేవలను చూసి సాక్షాత్తు ప్రధాని కార్యాలయం ప్రశంసించిందని గుర్తు చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో 27 మంది మహిళలకు కార్పొరేటర్లుగా అవకాశం కల్పించారని తెలిపారు. టీడీపీ హయాంలో గంజాయి, మద్యం మాఫియా రాజ్యం ఏలిన విషయం ప్రజలు మరిచిపోలేదన్నారు. డెప్యూటీ మేయర్‌గా నగర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న భూమన అభినయ్‌రెడ్డిపై పాదయాత్రలో నారా లోకేష్ చేస్తున్న తప్పుడు ఆరోపణలు సరికాదన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు సంధ్య, శ్రావణి, రాధా, ఆదిలక్ష్మి, రత్నకుమారి, ఉమాయాదవ్, దూది కుమారి, పునీత, సునీత పాల్గొన్నారు.

అవాకులు చవాకులు పేలితే తీవ్ర పరిణామాలు

నిరంతరం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిపై అవాకు లు, చవాకులు పేలితే తీవ్ర పరిణామాలు ఎదుర్కో వాల్సి వస్తుందని డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కాపు ఉద్యమనేత బాలిశెట్టి కిషోర్ హెచ్చరించారు. వారు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నారా లోకేష్ తిరుపతిలో నోటికొచ్చి నట్లు అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా ప్రజలకు మంచి చేశానని చెప్పుకు నే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏనాడూ తిరుపతి అభివృద్ధిని కాంక్షించలేదన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన తనయుడు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి కూడా అదే పంథాలో నడుస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి తిరుపతి నగరాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా లోకేష్ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో ప్రజల నుంచి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాపు నేతలు మద్దాలి శేఖర్, దూది శివారాయల్, సూరి రాయల్, కార్పొరేటర్లు పొన్నాల చంద్ర, దూవి కుమారి పాల్గొన్నారు.

టీడీపీ కనుమరుగు భయంతోనే లోకేష్ విమర్శలు

తిరుపతిలో టీడీపీ కనుమరుగుతోందన్న భయంతోనే నారా లోకేష్ యువ నేత భూమన అభినయ్‌రెడ్డి కువిమర్శలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్ ఆరోపించారు. ఆయన ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమి చేశామో చెప్పకుండా డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిపై విమర్శలు చేయడం నారా లోకేష్ చేతకాని తనానికి నిదర్శనమన్నారు. 40 ఏళ్లుగా తిరుపతి నగరం ట్రాఫిక్‌తో విలవిలలాడినా టీడీపీ నేతలు ఏమి చేయలేదన్నారు. భూమన కుటుంబం ప్రజలతో మమే కమై వారి కష్టాలను తెలుసుకుని పరిష్కారానికి ఎప్ప టికప్పుడు కృషి చేస్తోందన్నారు. నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లతో ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయని పేర్కొన్నారు. ఏదైనా మాట్లాడేటప్పుడు విషయం తెలుసుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలారి రాజేంద్ర, జిల్లా అధ్యక్షుడు నల్లానిబాబు, కార్పొరేటర్లు హనుమంతనాయక్, రామస్వామి వెంకటేశ్వర్లు, కుడితి సుబ్రమణ్యం, ఆదం రాధారెడ్డి, నేతలు సీకే.రవి, తిరుత్తణి వేణుగోపాల్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో పేరూరు పూర్

- పన్నుల వసూళ్లలో అట్టడుగు స్థానం
- కార్యదర్శికి మెమో జారీ చేసిన డీపీఓ



పేరూరు పంచాయతీ కార్యాలయం

తిరుపతి రూరల్: పంచాయతీల అభివృద్ధి ప్రధాన ఆదాయ వనరు పన్నులే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులు అదనం. కొన్ని పంచాయతీల కార్యదర్శులు పన్నులను అధిక శాతం వసూలు చేసి ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులతో ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. పేరూరు పంచాయతీలో మాత్రం పన్నుల వసూలులో కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ సీనియర్ కార్యదర్శి ఒకరు, ఇద్దరు గ్రేడ్-6 కార్యదర్శులతోపాటు కలిసి 34 మంది సిబ్బంది ఉన్నారు. వారు చిత్తశుద్ధితో పనిచేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీకి ప్రధాన ఆదాయ వనరు అయిన పన్ను వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 11 నెలలుగా 17 శాతం కూడా పూర్తి చేయలేకపోయారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన డీపీఓ పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ చేశారు.

మండలంలో రూ.12.16 కోట్ల డిమాండ్

తిరుపతి రూరల్ మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటి నుంచి వసూలు కావాల్సిన ఇంటి పన్నులు రూ.9.32 కోట్లు. ఈ ఏడాది ఇప్పటి వరకు బకాయిలు మరో రూ.2.83 కోట్లు ఉన్నాయి. మొత్తం రూ.12.16 కోట్లు వసూలు కావాల్సి ఉంది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు రూ.6.34 కోట్లను మాత్రమే వసూలు చేశారు. తన పల్లిలో 88 శాతం, చిగురువాడలో 81 శాతం వసూలు చేశారు. మండలంలో అన్ని పంచాయతీల కంటే పేరూరులో పన్నుల వసూలు దారుణంగా ఉంది. అక్కడ రూ.82.11 లక్షలకు గాను రూ.17.58 లక్షలు మాత్రమే వసూలు చేశారు. అక్కడ గ్రేడ్-1 కార్యదర్శిగా మాధవి, సచివాలయాల కార్యదర్శులు ఇద్దరు, మరో 29 మంది వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు 17 శాతం మాత్రమే పన్నులు వసూలు కావడంపై ఈఓపీఆర్డీ, డీఎల్‌పీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వీడకపోవడంతో జిల్లా పంచాయతీ అధికారి గ్రేడ్-1 కార్యదర్శి మాధవికి మెమో జారీ చేశారు. పేరూరు తర్వాత మల్లంగుంటలో 19 శాతం, బ్రాహ్మణపట్టులో 32 శాతం, గాంధీపురంలో 35 శాతం వసూలు చేశారు. దీనిపై ఈఓపీఆర్డీ నీలకంఠరెడ్డిని వివరణ కోరగా పన్నుల వసూళ్లలో నిర్లక్షం చూపుతున్న కార్యదర్శులకు మెమోలు జారీ చేశామన్నారు.

హస్త కళలను ఆదరించాలి



ప్రదర్శనలో కొయ్య బొమ్మలను తిలకిస్తున్న పోకల అశోక్‌కుమార్

తిరుపతి కల్చరల్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణం పట్టే హస్తకళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాలని టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖాదీ కాలనీలోని శివశక్తి కల్యాణ మండపంలో ఆదివారం చేనేత జౌళి మంత్రిత్వ శాఖ సౌజన్యంతో చిత్తూరు హ్యాండీక్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. స్టాల్స్‌ను పరిశీలించి కళారూపాల తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో భారతీయ సంస్కృతి, సంప్రదాయానికి ఎనలేని గౌరవం లభిస్తోందన్నారు. మన సంస్కృతిని పరిరక్షిస్తున్న కళాకారులు అభినందనీయులన్నారు. హస్త కళాకారులను ఒకే వేదికపైకి తెచ్చి కళారూపాల విక్రయాలతో ఆదరిస్తున్న నిర్వాహకులు దశరథాచారిని అభినందించారు. హ్యాండీ క్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.దశరథాచారి మాట్లాడుతూ ప్రదర్శన మార్చి 6వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఇందులో 200 మంది కళాకారులు తయారు చేసిన వివిధ రకాల కొయ్య బొమ్మలు, చేనేత వస్త్రాలు, గృహోపకరణాలు ఉన్నాయని తెలిపారు. ఎస్వీయూ పాలక మండలి సభ్యుడు మల్లారపు మధు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత బండ్ల లక్ష్మీపతి, మంగళంపేట సురేష్, హరిచౌహాన్ నాయక్, నాగేంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

వేడుకగా సరస్వతి యాగం



సరస్వతి యాగం చేపడుతున్న వేద పండితులు, హాజరైన బ్రాహ్మణ సమాజం నేతలు

తిరుపతి కల్చరల్: విద్యార్థుల విద్యాభివృద్ధిని కాంక్షిస్తూ తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఇస్కాన్ సమీపంలోని కంచి మఠంలో సరస్వతి యాగం వేడుకగా నిర్వహించారు. ప్రముఖ వేద ఘనాపాటి చంద్రమౌళీశ్వర పర్యవేక్షణలో చేపట్టిన యాగంలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారికి కంకణాలు, అక్షింతలు అందజేసి ప్రసాదాలు వితరణ చేశారు. బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు భీమాస్ బాలాజీ మాట్లాడుతూ విద్య వినయాన్ని ఇస్తుందని, వినయం మంచి ప్రవర్తనను కలుజేస్తుందని, మంచి నడవడికతో ధనాన్ని సంపాదించవచ్చని తెలిపారు. ఆ ధనంతో అందరూ సుఖంగా ఉండగలరన్నారు. సరస్వతి అమ్మవారి అనుగ్రహంతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆచార్య చక్రవర్తి రాఘవన్, తిరుపతి బ్రాహ్మణ సమాజం కోశాధికారి ప్రభాకర్, సహాయ కార్యదర్శి ఓవి.రామశర్మ, కొత్తపల్లి విజయ్‌కుమార్, వేదం హరిప్రసాద్, గంగాధర్, పి.పట్టాభిరామరావు, ప్రసాద్, క్రెడిట్ సొసైటీ క్యాషియర్ కుమార్, మహిళా విభాగం సభ్యులు సంధ్యారాణి, జీఆర్.పుష్పలత పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన చిటిపిరాళ్ల చెన్నకేశవరెడ్డి



ఎమ్మెల్యేని చెవిరెడ్డిని సత్కరిస్తున్న చిటిపిరాళ్ల చెన్నకేశవరెడ్డి

పాకాల: మండల వైస్ ఎంపీపీ, తిరుపతి జిల్లా పంచాయతీ వింగ్ అధ్యక్షుడు చిటిపిరాళ్ల చెన్నకేశవరెడ్డి ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనను పదవికి ఎంపిక చేసినందుకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హరికృష్ణారెడ్డి, శ్రీరాములురెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు జడ్జిలు మన్మథరావు, వి.గోపాలకృష్ణ, ఏపీ ఫైనాన్స్ మినిస్టర్ బుగ్గన రాజేంద్రనాథ్, కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, జి.శ్రీనివాస్ నాయుడు, ఎమ్మెల్సీ అరుణ్ కుమార్, తెలంగాణ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, రఘునందనరావు, తెలంగాణ ప్రభుత్వ విప్ ప్రభాకరరావు, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, జబర్దస్త్ టీం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ప్రభుత్వంపై పచ్చ మీడియా కుట్ర



ఈనాడు పత్రిక ప్రతులను తగులబెడుతున్న వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని అప్రతిష్టపాలు చేసేందుకు పచ్చ మీడియా కుట్ర చేస్తోందని వైఎస్సార్ విద్యార్థి సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఓబుళరెడ్డి ఆరోపించారు. ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద వైఎస్సార్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఈనాడు పత్రిక ప్రతులను తగులబెట్టి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ, అభిమానాన్ని చూసి ఓర్వలేక చంద్రబాబు డైరెక్షన్‌లో పచ్చమీడియా అసత్య ప్రచారాలకు తెరతీసిందని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో మీడియాకు ఇచ్చిన స్వేచ్ఛను ఈనాడు వంటి పత్రికలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి పత్రికలు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకులు మణికంఠ, అశోక్‌రెడ్డి, వంశీరెడ్డి, సెంథిల్‌కుమార్, బాషా, భార్గవ్, ప్రేమ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా నడుకోవాలి



చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు టికెట్‌కు సరిపడా చిల్లర ఇవ్వడం లేదని కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, రిక్వెస్ట్ స్టాపింగ్‌లో డ్రైవర్లు బస్సులు నిలపడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. అందరూ ప్రయాణికులతో సహకరించాలని తెలిపారు. కండక్టర్లు ఫ్రెండ్లీగా ముందుకు సాగాలని హితవుపలికారు. చిన్న విషయానికీ వివాదానికి దిగడం మంచిపద్ధతి కాదని వెల్లడించారు. ఆర్టీసీపై ప్రయాణికులకు గౌరవం పెరిగేలా ఉద్యోగులు నడుచుకోవాలని సూచించారు. ప్రయాణికుల నుంచి పదే పదే ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న అధికారులు

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి ఫలితాలు సాధించాలని తిరుపతి జిల్లా విద్యాశాఖా. దికారి వి.శేఖర్ పిలుపునిచ్చారు. తిరుపతి ద్వారకానగర్‌లోని ఓ ప్రైవేటు స్కూలులో ఆదివారం ఏపీ ప్రభుత్వ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) ఆధ్వర్యంలో 2021-22 విద్యాసంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన 146 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కార అవార్డులు అందజేశారు. డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు రాష్ట్ర విద్యాశాఖ విభిన్న ప్రణాళికలు రచించిందని తెలిపారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు అందుక అనుగుణంగా కృషి చేసి ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణులయ్యేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అప్సా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.సుందరం, ఎం.జనార్ధన్, కోశాధికారి ఎం.రవీంద్ర, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.సుబ్రమణ్యంరాజు, ఎం.రమేష్‌బాబు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి నియోజకవర్గంలో జేసీఎస్ కన్వీనర్ల నియామకం

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు జగనన్న సచివాలయం, గృహ సారథులు(జేసీఎస్) కన్వీనర్లను నియమించినట్టు మ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి రూరల్ మండలానికి కొత్తపాటి మునీశ్వర్‌రెడ్డి, చంద్రగిరికి మునికేశవులు, చిన్నగొట్టిగల్లుకు ఖాదర్ అహ్మద్, పాకాలకు నంగా బాబురెడ్డి, రామచంద్రాపురానికి రమేష్‌రెడ్డి, ఎర్రావారిపాళెంకు చెంగల్‌రెడ్డిని నియమించినట్లు పేర్కొన్నారు. మండల కన్వీనర్లు జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు గృహ సారథులు, కన్వీనర్లు పనిచేయాలని పేర్కొన్నారు.

బెండసాగు.. లాభాలు బాగు



భాకరాపేట: కూరగాయల్లో బెండ సాగు మరింత లాభదాయకమని కేవీకే శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇందులో బిందు, మల్చింగ్ విధానంతోపాటు సేంద్రియ పద్ధతులను అవలంబిస్తే అధిక లాభాలు పొందవచ్చని పేర్కొంటున్నారు. ఈ పంటకు వేడి వాతావరణం అనుకూలంగా ఉంటుంది. జనవరి రెండో వారం నుంచి ఫిబ్రవరి చివరి వరకు విత్తనాలు వేసుకోవచ్చు. వర్షాకాలంలో ఎకరాకు 4-6 కిలోలు, వేసవిలో 7-8 కిలోల విత్తనాలు సరిపోతాయని కేవీకే శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్భని క్రాంతి, ఆర్క అనామిక, ఆర్క అభయ రకాలు సాగులో ఉన్నాయి. ఈ పంట 85 నుంచి 90 రోజుల్లో చేతికి వస్తుంది. అంతేగాక చీడపీడలు కూడా పెద్దగా ఆశించవు.

ఎరువుల యాజమాన్యం

ఎకరాకు బాగా మాగిన పశువుల ఎరువు 6 నుంచి 8 టన్నులు, 24 కిలోల భాస్వరం, పొటాష్ వేసుకోవాలి. 48 కిలోల నత్రజని ఇచ్చే ఎరువులను మూడు సమ భాగాలుగా చేసి 1/3 ఆఖరి దుక్కిలోను, మిగిలిన 2/3 వంతును రెండు భాగాలుగా విత్తిన 30వ, 45వ రోజుల్లో వేయాలి. పంట పూత దశలో లీటర్ నీటికి 10 గ్రాముల సూక్ష్మపోషక పదార్థాల మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. తద్వారా 20-25 శాతం దిగుబడి పెరుగుతుంది. వర్షాలు రాక పోతే 7-8 రోజులకు ఒక తడి, వేసవి పంటకు ప్రతి 4-5 రోజులకు ఒకసారి నీటి తడులు పెట్టాలి.

బెండను ఆశించే పురుగులు

బెండకు మొవ్వకుళ్లు, కాయ తొలుచు పురుగులు ఆశిస్తాయి. ఆయా కొమ్మలను అంగుళం కిందికి తుంచాలి. లీటర్ నీటికి 2 మిల్లీలీటర్ల క్వినాల్‌ఫాస్ లేదా ప్రొఫెనోఫాస్‌ను కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు కాయలు కోసిన తర్వాత పిచికారీ చేయాలి. అదేవిధంగా దీపపు పురుగులు ఆశిస్తే ఆకులు పైకి ముడుచుకుని పండుబారి రాలిపోతాయి. వీటి నివారణకు లీటర్ నీటికి 2 మిల్లీ లీటర్ల మిథైల్‌డెమోటాన్ లేదా డై మిథోయేట్ లేదా ఫిప్రోనిల్ కలిపి పిచికారీ చేయాలి. ఎర్రనల్లి పంట చివరి దశలో ఆశించడం వల్ల ఆకులు తెల్లగా పాలిపోయి పండుబారిపోతాయి. వీటి నివారణకు లీటర్ నీటికి 3 గ్రాముల నీటిలో కరిగే గంధకపు పొడి లేదా 5 మిల్లీ లీటర్ల డైకోఫాల్ కలిపి పిచికారీ చేయాలి. అలాగే తెల్లదోమ పూతకు ముందు ఆశిస్తుంది. దీని వల్ల ఆకులు పసుపు రంగులోకి మారతాయి. దీని నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పొలంలో అక్కడక్కడా పసుపు రంగు డబ్బాలకు గ్రీజు కానీ, ఆముదం కానీ పూసి పెట్టడం ద్వారా తెల్లదోమను నివారించవచ్చు.

బూడిద రంగు తెగులు

తెగులు ఉధృతి ఎక్కువైతే ఆకులు పసుపు రంగులోకి మారి రాలిపోతాయి. దీని నివారణకు లీటర్ నీటిలో 3 గ్రాముల కరిగే గంధకపు పొడిని లేదా 1 మిల్లీ లీటర్ డైనోకాఫ్ కలిపి పిచికారీ చేయాలి.

సకాలంలో కోత కోయాలి

విత్తిన 45-50 రోజులకు మొదటి కోత వస్తుంది. తప్పనిసరిగా ప్రతి రెండు మూడు రోజులకు ఒకసారి కాయలు కోయాలి. ఎకరాకు వర్షాకాలపు పంటకు 3-4 టన్నులు, వేసవి పంటకు 2-2.5 టన్నులు దిగుబడి వస్తుంది. రైతులు సమీకృత వ్యవసాయాన్ని ఆధునిక పద్ధతుల్లో చేపట్టాలి. రైతులందరూ రైతు ఉత్పత్తి సమాఖ్యలుగా ఏర్పడి పంటను వేసి స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయాలి.

– సుధాకర్, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, తిరుపతి